క్లుప్తంగా

ఆనందోత్సాహాలతో సంక్రాంతి


శ్రీనివాసులు


విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి వేర్వేరుగా ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, క్యాడర్, రైతులు, వ్యాపారులు, కార్యకర్తలు బాగుండాలని ఆకాంక్షించారు. కనుమరుగయ్యే భోగి మంటల వెలుగులు పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని ప్రసాదించాలన్నారు. మకర సంక్రాంతి కాంతులతో ప్రతి ఇల్లు సౌభాగ్యాలతో శోభాయమానంగా వెలుగొందాలని కోరారు.

పోలీసులకు బకాయిల చెల్లింపుపై హర్షం

చిత్తూరు అర్బన్: పోలీసు ఉద్యోగుల అడిషనల్ సరెండర్ లీవు బకాయిల చెల్లింపుపై పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఉదయ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. 2024 జనవరి నెల నుంచి జూన్ వరకు సరెండర్ లీవు బిల్లులు, జీపీఎఫ్, సీపీఏ ఉద్యోగుల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఈ బకాయిలను వెంటనే మంజూరు చేసేలా ఆదేశాలు జారీ చేయడం ఆనందకరమని ఆయన పేర్కొన్నారు.

బీసీ మహిళా ప్రధాన కార్యదర్శిగా హేమావతి


నియామకపత్రం అందుకుంటున్న హేమావతి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శిగా హేమావతిని నియమిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రకటించారు. చిత్తూరు నగరంలోని బీసీ సంక్షేమ కార్యాలయంలో ఆదివారం ఇంచార్జ్ షణ్ముగం ఆ నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు నాగేంద్ర, గిరిజ, రమా, ప్రియ, సెల్వి, హర్షవర్ధన్, హరిగణేష్ తదితరులు పాల్గొన్నారు.

21న చిత్తూరుకు తరలి రండి

పుంగనూరు: ఎంఆర్‌పీఎస్ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21న చిత్తూరుకు వస్తున్న ఉప కులాల ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రాను కలిసేందుకు చిత్తూరుకు తరలి రావాలని స్థానిక ఎంఆర్‌పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అధ్యక్షుడు నరసింహులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. నరసింహులు మాట్లాడుతూ ఉప కులాల కమిషన్‌కు తమ 30 ఏళ్ల పోరాటాన్ని వివరించేందుకు ఎంఆర్‌పీఎస్ కుటుంబసభ్యులు అందరూ తరలి రావాలన్నారు. దీని ద్వారా విభజన కార్యక్రమం విజయవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంఆర్‌పీఎస్ నేతలు పాల్గొన్నారు.

వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి

పుంగనూరు: స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని హోమియో డాక్టర్ సరళ పిలుపునిచ్చారు. స్థానిక బీఎంఎస్ క్లబ్‌లో ఆదివారం వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువకులు అధిక సంఖ్యలో హాజరై రక్తదానం చేశారు.

కోడి పందాలు నిర్వహిస్తే చర్యలు


సీఐ సోమశేఖర్‌రెడ్డి

వి.కోట: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో ఎక్కడైనా కోడిపందాలు, ఇతర జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ సోమశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కోడిపందేలు ఆడడం చట్టరీత్యా నేరమన్నారు. కోడిపందేలు, పేకాట నిర్వహించడం పూర్తిగా నిషేధమని ఎవరైనా ఈ క్రియాకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ తెలిపారు.

జూదం ఆడితే జైలుకే!

పుంగనూరు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎలాంటి జూదాలు ఎవరు ఆడినా జైలుకేనని సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ పర్యవేక్షణలో అన్ని గ్రామాల్లోనూ జూదాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో అశ్లీల కార్యక్రమాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేస్తామన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాల నిర్మూలనకు ప్రజలు సహకరించాలని కోరారు.

బీమాతో ధీమా


పాలసీలపై అవగాహన కల్పిస్తున్న ఉద్యోగి

ప్రైవేటు పాలసీలు ఎన్ని వస్తున్న తపాలా పాలసీలపై ప్రజలకు నమ్మకం ఎక్కువ. తక్కువ చెల్లింపులతో ఎక్కువ బోనస్‌లు ఇస్తారనే విశ్వాసం ఉంది. తపాలా శాఖలో పలు పాలసీలు ఉన్న ప్రజల్లో అవగాహన ఆశించిన స్థాయిలో లేదు. జీవిత బీమా పథకం ప్రజల జీవితాలకు ఆర్థిక భరోసా ఇచ్చేలా దోహద పడుతోంది. 1884 ఫిబ్రవరి 1న కేవలం తపాలా శాఖలో ఉద్యోగం చేసే వారి కోసం ప్రారంభమైన పీఎల్ఐ(పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్) కాలక్రమేణా అందరికీ అందుబాటులోకి తెచ్చారు. –చిత్తూరు కార్పొరేషన్

- ప్రీమియం తక్కువ.. బోనస్ ఎక్కువ
- పాలసీలపై అవగాహన తక్కువ


పాలసీలపై ముద్రించిన కరపత్రం

తపాలా బీమా పాలసీలను 18 నుంచి 55 సంవత్సరాల్లోపు వయస్సు గల వారు తీసుకోవచ్చు. రూ.20 వేల నుంచి దాదాపు రూ.50 లక్షల వరకు తీసుకునే సౌకర్యం ఉంది. పాలసీలు 3 నెలలు, 6 నెలలు, సంవత్సరానికి ఒకసారి చెల్లించే సౌలభ్యం ఉంది. పీఎల్ఐలో ప్రధానంగా ఆరు రకాల పాలసీలు అమలవుతున్నాయి. వాటిలో సంతోష్, సువిధ, సుమంగళి, యుగళ్ సురక్ష, సురక్ష, బాలాజీ వన్ బీమా పాలసీలున్నాయి. వీటిపై ప్రజల్లో చాలా మందికి అవగాహన లేదు. దీనిపై పోస్టల్ శాఖ అధికారులు సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

పాలసీల వివరాలు

సంతోష్: తపాలా శాఖ ద్వారా తీసుకున్న పాలసీలలో అధిక శాతం మంది మొగ్గు చూపుతున్న ఎండోమెంట్ పాలసీ ఇది. క్రమంగా ప్రీమియం చెల్లించిన 3 సంవత్సరాల తర్వాత రుణం తీసుకునే సదుపాయం ఉంది. ప్రీమియం మొత్తం ట్యాక్స్ సేవింగ్ బెనిఫిట్‌ను పొందవచ్చు. పాలసీ ఆమోదించిన నాటి నుంచి పూర్తి జీవిత రక్షణ ఉంటుంది.

సువిధ: హోల్ లైఫ్ పాలసీదారులు 5 సంవత్సరాలు పూర్తి అయిన తర్వాత సంతోష్ పాలసీలోకి మారే వెసులుబాటు కల్పించారు. తక్కువ డబ్బులు చెల్లించే వీలుతోపాటు రుణం తీసుకునే సౌకర్యం కలదు.

సుమంగళి: మనీ బ్యాక్ పాలసీగా తపాలా శాఖ అందిస్తోంది. 15, 20 సంవత్సరాల వ్యవధిలో పాలసీని పొందవచ్చు. 15 సంవత్సరాల పాలసీలో వరుసగా 6 సంవత్సరాలు పూర్తి కాగానే కట్టిన మొత్తం నుంచి 20 శాతం, 9 సంవత్సరాల తర్వాత మరో 20 శాతం, 12 సంవత్సరాల తర్వాత మరో 20 శాతం, చివరగా 15 సంవత్సరాల తర్వాత 40 శాతం నగదుతోపాటు అదనపు బోనస్‌ను పొందవచ్చు. దీంతో పాటు 20 సంవత్సరాల పాలసీలు 8, 12, 16, 20 సంవత్సరాలలో బోనస్ లభిస్తుంది. ప్రధానంగా మధ్య తరగతి ఉద్యోగులకు ప్రయోజనకరం.

యుగళ్ సురక్ష: ఇది జాయింట్ (భార్యాభర్తలకు) పాలసీ. ఇందులో ఒకరు ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. రిస్క్ కవరేజ్ మాత్రం దంపతుల ఇద్దరికీ వర్తిస్తుంది. ఈ పాలసీకి సంతోష్ పాలసీ నిబంధనలు వర్తిస్తాయి. ఈ పాలసీ కింద నాన్ మెడికల్ పాలసీగా గరిష్ఠంగా రూ.5 లక్షలకు మాత్రమే తీసుకోవచ్చు.

సురక్ష: ఇది కూడా హోల్‌లైఫ్ పాలసీ. 19 నుంచి 58 సంవత్సరాల గల వారు పాలసీకి అర్హులు. రూ.20 వేల నుంచి రూ.50 లక్షల వరకు పాలసీని తీసుకోవచ్చు. 4 సంవత్సరాలు చెల్లించిన తరువాత రుణం తీసుకునే సౌలభ్యం ఉంది. మెచ్యూరిటీ మొత్తాన్ని 80 సంవత్సరాల తర్వాత పాలసీదారుడికి గాని, వారి నామినీకి గాని చెల్లిస్తారు. ప్రతి లక్ష రూపాయలకు రూ.7,600 బోనస్‌గా ఏడాదికి అందుకోవచ్చు.

చిల్డ్రన్స్ పాలసీ: 5 నుంచి 20 సంవత్సరాల లోపు బాల, బాలికలకు ఈ పాలసీని తపాలా శాఖ అందిస్తోంది. ప్రధానంగా పీఎల్ఐ పాలసీని పిల్లల తల్లిదండ్రులు నమోదై ఉంటేనే.. ఈ చిల్డ్రన్స్ పాలసీ వర్తిస్తుంది. ఇందులో రూ.20 వేల నుంచి రూ.30 లక్షల వరకూ పాలసీ తీసుకునే సౌకర్యం కలదు.

పాలసీలు ఉపయోగకరం



తపాలా శాఖ ద్వారా అందే బీమా పాలసీలు ఎంతో ఉపయోగకరం. ఇతర బీమా సంస్థల నుంచి వచ్చే రాబడి కంటే మెరుగైన ఆదాయం వస్తుంది. అన్నిరకాల ఉద్యోగులు పీఎల్ఐ పాలసీలను అన్ని తపాలా కార్యాలయాల్లో పొందవచ్చు. పాలసీలు తీసుకుంటే కుటుంబానికి భరోసా ఉంటుంది.

–పురుషోత్తం, సబ్ పోస్టుమాస్టర్

బదిలీల్లో పెర్ఫార్మెన్స్ పాయింట్ల విధానం వద్దు


బాలాజీ

చిత్తూరు కలెక్టరేట్: బదిలీల చట్టంలో టీచర్లకు పెర్ఫార్మెన్స్ పాయింట్ల విధానం వద్దు అని ఆపస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న బదిలీల పెర్ఫార్మెన్స్ పాయింట్ల విధానంతో టీచర్లకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఈ విధానం అమలు చేస్తే పైరవీలకు అవకాశం ఏర్పడుతుందన్నారు. సదరు పాయింట్లతో గతంలో దుర్వినియోగం జరిగిందని గుర్తు చేశారు. కేవలం సర్వీస్, పాఠశాల స్థాయి పాయింట్లు, ప్రిఫరెన్షియల్ పాయింట్లతో మాత్రమే బదిలీల చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

ఫిబ్రవరిలో నాక్ బృందం సందర్శన

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఫిబ్రవరి 13, 14వ తేదీల్లో నాక్ బృందం సందర్శించనుంది. ఎంతో చరిత్ర కలిగిన పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 2017 మార్చి 28 నాక్ – ఏ గ్రేడ్ లభించింది. ఆ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ లభించిన అనంతరం ఎంతో అభివృద్ధి చెందింది. నిబంధనల మేరకు మరోసారి నాక్ బృందం ఫిబ్రవరి 13, 14వ తేదీల్లో కళాశాలను సందర్శించి గ్రేడ్ ఇవ్వనుంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను ఆ కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి పర్యవేక్షణలో పకడ్బందీగా నిర్వహిస్తున్నారు.

కన్నులపండువగా గోదాదేవి కల్యాణం

తవణంపల్లె: మండలంలోని అరగొండలో వెలసిన కోదండ రామాలయంలో ఆదివారం సాయంత్రం రంగనాథస్వామి, గోదాదేవి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. కోదండ రామాలయంలో అర్చకులు సీతారామ లక్ష్మణులకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతర ఆలయ మండపంలో అర్చకులు గోదాదేవి కల్యాణోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అర్చకులు రంగనాథస్వామి, గోదాదేవి కల్యాణానికి ఉభయదారులు పట్టువస్త్రాలు, సారెలు, పూజా సామగ్రి, మంగళ సూత్రంను భక్తితో సమర్పించారు. అర్చకులు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వేదమంత్రాలు పఠనం చేస్తూ ఘనంగా నిర్వహించారు.

గోకులం షెడ్లతో ఉపాధి


గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఐరాల: పాడి రైతులు గోకులం షెడ్లను సద్వినియోగం చేసుకొని ఉపాధి మెరుగు పరుచుకోవాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ కోరారు. ఆదివారం మండలంలోని చిగరపల్లెలో నిర్మించిన గోకులం షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి నిధుల నుంచి నిర్మిస్తున్న గోకులం షెడ్లు రైతు కుటుంబాలకు ఆర్థిక ప్రగతి చేకూరుతుందన్నారు. మండలంలో 82 గోకులం షెడ్లు మంజూరు కాగా ఇందులో 42 మంది లబ్ధిదారులు గోకులం షెడ్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ సంధ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నేతకు నివాళి


వరదరాజులు మృతికి నివాళి అర్పిస్తున్న రాష్ట్ర నేతలు

కాణిపాకం(యాదమరి): దళితరత్న అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు వరదరాజులు శనివారం తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో ఆకస్మిక మృతి చెందాడు. ఆదివారం యాదమరి మండలంలోని తెల్లరాళ్లపల్లెలో వరదరాజులు మృతదేహానికి రాష్ట్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు, కర్ణాటక రాష్ట్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఓబుల్‌క్రిష్ణ, ఏపీ గౌరవాధ్యక్షుడు వెంకటేష్, రాష్ట్ర , జిల్లా నేతలు శేఖర్, శ్రీనివాసులు, గురుశంకర్, జిల్లా చర్మకారుల సంఘం అధ్యక్షుడు రమేష్, చెంగయ్య, పలువురు నాయకులు నివాళులర్పించారు.

బీవీరెడ్డి స్కూల్‌కు 37 ఏళ్లు

- విద్యార్థులకు దిక్సూచి
- ఫలితాల్లో మేటి


రెయిన్‌బో స్కూల్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని బీవీరెడ్డి సీనియర్ సెకండరీ పాఠశాల 37 ఏళ్లు పూర్తి చేసుకుంది. బాల బాలికలకు విద్యా, వైజ్ఞానిక, సాంకేతిక, క్రీడా రంగంలో సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతోంది. మానసిక ఒత్తిడి లేకుండా సువిశాలమైన వాతావరణంలో విద్యను అందిస్తోంది. సీబీఎస్ఈ విద్యా విధానంలో 2025–26కుగాను ఇంటర్మీడియట్‌లోని వివిధ గ్రూపులకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి.

క్రమశిక్షణతో పాఠం నేర్పుతూ...

చిత్తూరు నగరంలోని రెయిన్‌బో స్కూల్ గత 9 సంవత్సరాలుగా విజయ పథంలో నడిపిస్తున్నామని ఆ స్కూల్ కరస్పాండెంట్ మోహన్‌రెడ్డి వెల్లడించారు. ఏటా పదో తరగతి ఫలితాల్లో 60 శాతం మంది విద్యార్థులకు 90 శాతం కంటే అధిక ఫలితాలు వస్తున్నాయన్నారు. ఈ సంస్థలో చదువుకున్న చాలా మంది విద్యార్థులు ఐఐటీ, ఉన్నత యూనివర్సిటీలలో విద్యాభ్యాసం చేస్తున్నారన్నారు. పాఠశాల నిర్వహణలో శ్రద్ధ వహిస్తున్నామన్నారు. పిల్లలకు క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్పుతున్నామన్నారు. క్రీడలు, విద్య, తదితర విషయాల్లో ప్రోత్సహిస్తూ మంచి ఫలితాలు సాధించేలా చూస్తున్నామన్నారు.

విద్యుత్ బిల్లులను తగలబెట్టండి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దహనం చేసే కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు తెలిపారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అదనపు విద్యుత్ భారాలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. 2026 జనవరి వరకు సర్దుబాటు భారం తప్పదని గతంలో ప్రభుత్వం తెలిపిందన్నారు. కానీ ఇటీవల విద్యుత్ భారం వినియోగదారులపై వేయకుండా సర్కార్ ఎత్తువేస్తున్నట్లు ప్రకటించిందన్నారు. అది ఎప్పటి నుంచి అమలు అవుతుందో తెలపాలన్నారు. రోజువారీ విద్యుత్ వాడకంలో మార్పులు చేయరాదన్నారు. టైం ఆఫ్ డే విధానాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. 24 గంటలను పీక్ అవర్స్, హాఫ్ పీక్ అవర్స్, నార్మల్ అవర్స్ కింద విభజించాలనే ప్రయత్నాన్ని విరమించాలన్నారు. స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేయరాదన్నారు. ఇందుకు నిరసనగా విద్యుత్ బిల్లులు తగలబెట్టే కార్యక్రమంలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని వివరించారు.

సంస్కృతి, సంప్రదాయాలను అనుసరిద్దాం

- మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు సుబ్రమణ్యంశర్మ
- చిత్తూరులో రచయితల సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు


విశేషంగా ఆకట్టుకున్న సంక్రాంతి ముగ్గు



రచయిత సంధ్యాశర్మను సన్మానిస్తున్న మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు సుబ్రమణ్యం శర్మ


వైద్యసేవ విభాగానికి సంబంధించిన రాణిని సన్మానిస్తున్న దృశ్యం


సేవ కార్యక్రమానికి సంబంధించి పార్థసారథినాయుడును సన్మానిస్తున్న దృశ్యం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మన సంస్కృతి, సంప్రదాయాలను అనుసరించడంతో పాటు కళలను కాపాడుకోవాలని మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు సుబ్రమణ్యం శర్మ తెలిపారు. చిత్తూరు నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో ఆదివారం జిల్లా రచయితల సంఘం, ఎంపీ.కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. తొలుత నిర్వాహకులు, కళాకారులు, రచయితలు, సాహితీ ప్రియులు గాంధీ విగ్రహం నుంచి గంగిరెద్దులు, మేళతాళాలు, కోలాటాలు, హరిదాసులు వివిధ కళారూపాల కళా ప్రదర్శనలతో కళాక్షేత్రం వరకు ఊరేగింపుగా వచ్చారు. అక్కడ వేసిన సంక్రాంతి ముగ్గులు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం సభావేదికపై పలువురు విద్యార్థులు భరతనాట్య ప్రదర్శన అలరించింది. సుబ్రమణ్యం శర్మ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో టెక్నాలజీ పెరిగి సంప్రదాయాలను దూరం చేసుకుంటున్నామని చెప్పారు. ప్రధానంగా ముబైల్ ఫోన్‌కు అతుక్కుపోయి..సంప్రదాయాలతో పాటు బంధాలను కూడా మర్చిపోతున్నారని వాపోయారు. ఈ క్రమంలో సంస్కృతి, సంప్రదాయాలు, కళలను కాపాడుకోవడానికి అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్ తరాల వారికి పండుగలు, సంస్కృతి, సంప్రదాయాలను వారసత్వంగా అందించాలని పిలుపునిచ్చారు. తదనంతరం వివిధ రంగాల్లో ఉత్తమ సేవకులు చేసిన వారిని ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, చుడా చైర్మన్ కఠారి హేమలత, నిర్వాహకులు సహదేవనాయుడు, రామలక్ష్మి, పార్థసారథినాయుడు, శ్యామలదేవి, సామినిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మునస్వామి, కోదండరెడ్డి, పద్మావతి, అరుణ, శివప్రసాద్, కృష్ణంరాజు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సత్యమ్మకు పూజలు


సత్యమ్మ తల్లి


తుంబకుప్పంలో అమ్మవారికి పూజలు

బంగారుపాళెం: మండలంలోని పెరుమాళ్లపల్లె, తుంబకుప్పం, తుంబపాళెం గ్రామాల్లో ఆదివారం గ్రామదేవతలు సత్యమ్మ, విరుపాక్షమ్మ వారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యమ్మ మూల విగ్రహానికి 101 బిందెల జలంతో అభిషేకించారు. సంక్రాంతి పండుగకు ముందు సత్యమ్మతల్లికి పూజలు చేయడం సంప్రదాయంగా వస్తోంది.


పెరుమాళ్లపల్లెలో అభిషేకానికి నీరు తెస్తున్న చిన్నారులు

సంప్రదాయ పంట అనప


పట్టణంలో విక్రయానికి ఉంచిన అనపకాయలు

వి.కోట: శీతాకాలం వచ్చింది అనపకాయలు పంట సీజన్ ప్రారంభమైంది. అనపకాయల సీజన్ ప్రారంభ కావడంతో ఏ ఇంట్లో చూసినా అనపకాయల పులుసులే ఘుమఘుమ లాడుతున్నాయి. అనపకాయలను సాధారణంగా సంక్రాంతి కాయలని కూడా అంటారు. అనపకు రాయలసీమలో ప్రత్యేకత ఉంది. ముఖ్యంగా రాయల సీమలో రైతులకు ఇది సంప్రదాయ పంటగా పండిస్తారు. మండలంలో 75 ఎకరాల్లో అనపను అంతర్ పంటగా రైతులు సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ పంటను సాధారణంగా వేరుశనగ పంటలో అంతర్ పంటలుగా సాగు చేస్తారు. ఇది అంతర్ పంటగా అనపను సాగు చేయడంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు లేకపోవడంతో రైతులకు ఈ పంట ఆర్థికంగా ఆదుకుంటుందనే చెప్పవచ్చు. పలమనేరు, వి.కోట, కుప్పం ప్రాంతాల ప్రజలు వీటిని నిత్యం వంటకాల్లో ఈ సీజన్‌లో వాడతారు. దీంతో స్థానిక రైతులు అనప పంటకు ఎక్కువగా ప్రాధాన్యతినిస్తుంటారు. ఇక్కడి రైతులు అనపను తిరుపతి, బెంగళూరు, క్రిష్ణగిరి, గుడియాత్తం వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. డిసెంబర్, జనవరి నెలల్లో వీటి రుచి మరింత పెరుగుతుందని పెద్దల నానుడి. ముఖ్యంగా బ్రాహ్మణులు, వైశ్యులు దీన్ని ఎక్కువగా ఇష్టపడుతూ మూడు నెలలవరకూ అనపతో రకరకాల వంటలు చేసి భుజిస్తుంటారు. ప్రస్తుతానికి మార్కెట్‌లో వీటి ధర రూ.70 నుంచి రూ.100 వరకూ పలుకుతోంది. దీన్ని సంక్రాంతి రోజున అనపకాయలతో పితికిపప్పును చేసి సంప్రదాయ వంటగా వాడతారు. దీంతో సంక్రాతి పండుగకు వీటి ధర మరింత పెరిగే అవగాశం ఉన్నట్లు వ్యాపారస్తులు చెబుతున్నారు.

గాయపడిన వ్యక్తికి చేయూత

పుంగనూరు: పుంగనూరు మండలం ప్రసన్నయ్యగారిపల్లెలో రెండు రోజుల క్రితం కత్తిపోట్లకు గురైన సుబ్రమణ్యంకు వైద్యసేవల నిమిత్తం బలిజ సంఘం చేయూతనిచ్చింది. ఆదివారం సంఘ నాయకులు రమణ, కుమార్, భాస్కర్, రాఘవ, జనార్దన్, మోహన్, సురేష్, సుధీర్ కలసి బాధితుడి తల్లికి రూ.25 వేలు విరాళం అందజేశారు. బాధితుడికి అవసరమైతే సంఘం తరపున మరింత చేయూతనిస్తామని తెలిపారు.

మకరజ్యోతి దర్శనం రేపు


అయ్యప్ప ఆలయం

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె కోటమలై అయ్యప్పస్వామి ఆలయంలో 14న మకరజ్యోతి దర్శనం నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబసభ్యులతో కలసి ఊరేగింపుగా అయ్యప్ప ఆలయానికి తిరు ఆభరణాలను తీసుకొస్తారు. వాటిని స్వామి వారికి అలంకరించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారు. సాయంత్రం సమీపంలోని కొండల్లో మకరజ్యోతి దర్శనం ఇస్తుంది. జ్యోతి దర్శనం అనంతరం ఆలయంలో అఖండజ్యోతి, కర్పూర దీపాలు వెలిగిస్తారు. వీటిని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం ఏర్పడకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.